# జిల్లేళ్లు

పా నాయనమ్మ 'అల్టిమేటమ్' జారీచేసింది.

"ఒరేయ్ ... అస్తమానం అలా పడుకోకపోతే నాన్నకి సహాయం పోకూడదూ! పొద్దుటనుండి ఆ కూలీలతో సతమత మవుతు న్నాడు... ఇటు పుల్లతీసి అటుబెట్టవ్! ... బొత్తిగా ఇదయి పోతు న్నావ్!"

తాంబూల పళ్ళాలలో చలిమిడి, తమలపాకులు, వక్కలు, అరటి పండ్లు కళకళలాడుతున్నాయి. మహిళా సంఘం సమావేశాన్ని అనధికా రంగా ఇష్టాగోష్ఠి చర్చలకు ఏర్పాట్లు - పేరంటంలో పాల్గొనే హక్కు నాకు జన్మతః లేదని మా నాయనమ్మ పలుకుల సారాంశం.

"శవం చెప్పిన సాక్ష్యం" అణా ఇచ్చి తెచ్చుకొన్నాను. సాయం త్రానికి ముగించాలి. పుస్తకం చేతబట్టి మా పొలంకేసి నడిచాను. మా ఊరి చెరువుకట్టపైనుంచి చూస్తే మా పొలం లీలగా కనిపించసాగింది.

కుప్ప నూరుస్తున్నారు. ఎద్దులు గడ్డిపరకలు కొరుక్కుంటూ గుండ్రంగా తిరుగుతున్నాయి. ప్రక్కనే కూలీలు మరో కుప్ప కొడుతు న్నారు. కట్టలు కట్టి మెత్తని వరిగడ్డిపై కూలీల పిల్లలు ఆనందంతో పల్టీలు కొడుతున్నారు; పిల్లి మొగ్గలేస్తున్నారు.

కట్ట దిగాను. సూర్య కిరణాలు నా వెన్ను తాకుతున్నాయి. కళ్ళు చీకరించుకొని నొసటిపై పుస్తకం అడ్డు పెట్టుకొని నడవవలసిన అవ సరం పోయింది. డొంకలో అడుగు పెట్టాను. ఇసుకలో నా కాళ్ళు కూరు కొనిపోయి లేస్తూన్న చప్పుడు, నా నడక కారణంగా రివ్వునలేచిపో తున్న పైరుపిట్టల రెక్కల చప్పుడు మినహా ఏమీలేదు.

"శవం చెప్పిన సాక్ష్యం" వింటూ నడక సాగించాను. కాళ్ళు

నడుస్తున్నాయి. కళ్ళు చదువుతున్నాయి. కొంతదూరం నడిచాను. కాళ్ళకు మంటలు తగిలాయి. ప్రక్కకు తిరిగి చూశాను.

అవి జిల్లేడు కొమ్మలు. పిచ్చికూసం మండలు, పాలుకారుతున్నాయి. డొంకకు ఇరువైపులా బొమ్మజెముడు పొదలు. జిల్లేళ్ళతో, పిచ్చికూసం చెట్లు పెనవేసికొన్నాయి. బొమ్మజెముడు గుబ్బలకోసమని ఆ జిల్లేడు కొమ్మలను కొట్టి విసిరిపారేశారు గొడ్డకాడ కుర్రాళ్ళు.

పుస్తకం మూశాను. పైజమాతో గాఢంగా పెనవేసికొన్న మండలు తొలగించాను. పైజమాపై జిల్లేడుపాలు, పిచ్చికూసం పాలు పడి ఆరిపొయ్యాయి. ఇక ఆ మరకలు పైజమా చిరిగితేనేగానీ పోవు. శవం చెప్పుకుంటూ వస్తున్న సాక్ష్యం ఇక వినదలచుకోలేదు. జాగ్రత్తగా చూసి నడుస్తూ పొలం చేరాను.

మా నాన్న అల్లంత దూరాన్నుంచే పల్కరించాడు "నిన్నెవరు రమ్మన్నార్రా! ఆ మొహం చూడు. ఎలా నల్లబడిపోయిందో—ఎండకు... కోటయ్యా...తాబేటికాయ అందియ్యి."

మంచినీళ్ళు తాగి వరిచెత్తపై కూలబడిపొయ్యాను అ కూలీల పిల్లలచెంత.

"పళ్ళు జిలబెట్టుద్ది బాబుగోరూ...అసలే కొత్త వరిగడ్డి." కోటయ్య కేకలేశాడు నాకేదో గండం వాటిల్లినట్లు.

"నీవు ఇక్కడ నాకు సహాయపడాల్సిందేముంది? ... పోయి ఆ లైబ్రరీకెళ్ళి చదువుకోరా...పో ... ఎండదెబ్బ తగుల్తుంది..." మా నాన్న హెచ్చరిక.

పితృదేవుల ఆజ్ఞ శిరసావహించి లైబ్రరీకి వెళ్ళాను. "శుక్రవారం సెలవు." బోర్డు వేలాడ వేసుకుంది తీగెల తలుపు. నాలగడుగులు ముందుకు నడచి మంచినీటికి చెరువుకట్టపైకి నడిచాను.

చెరువు ఒడ్డున మర్రిచెట్టు. ఆ చెట్ల నీడలో గాంధీగారిని నిలబెట్టారు మా ఊరి పెద్దలు. ఆయన కాళ్ళు సిమ్మెంటు అరుగులో బిగించి

గచ్చుచేశారు. మహాత్ముని పాదాలచెంత ఒక్కింత సేద దీర్చుకొందామని ఆశతో అరుగువద్దకు వెళ్ళాను.

ఆయన పాదాలను ఆసరాగా చేసుకొని రెండు చుట్టలు, రిటయిర్డు గవర్నమెంటు ఉద్యోగుల్లా పడి ఉన్నాయి. చుట్టూ చుట్ట కొరికి ఊసిన ముద్దలు భారతదేశపు ఫారిన్ ఎక్స్ఛేంజి విలువను చాటుతున్నాయి.

నేను మహాత్ముని కేసి చూశాను, జాలిగా — కాదు; జాతిపితా మహునికేసి. ఆయనమాత్రం బోసినోటితో నవ్వుతున్నాడు. నేను నవ్వ లేక పొయ్యాను.

మంచినీళ్ళు ముంచుకొనే రేవువద్దకు వెళ్ళాను. ఆ రేవు గోడ శుభ్రంగా చల్లగా వుంది. కాళ్ళ వ్రేలాడ వేసుకొని చదువు ప్రారం భించాను.

'బుడ బుడ' నీళ్ళు ముంచుకొని బిందెలు చంకనబెట్టుకొని వెళు తున్నారు. నా పరిసర ప్రభావం నాకు అస్పష్టంగా తెలుస్తున్నది. విసు రుగా బిందెనీళ్ళపై కొట్టిన చప్పుడైంది. నేను తలపైకెత్తి చూశాను.

కళ్ళు ఇంతింత చేసుకొని చూస్తున్నది నావైపు మా వీధిలో సూర్యకాంతంగారు.

నేను ఆరుగు దిగాను. షర్టు బొత్తాములు సరిగా పెట్టుకొన్నాను. ఆమె గళం విప్పింది. నేను చెవులు రిక్కించాను.

"ఏం చదువుతున్నావ్ నాయనా? ఇప్పుడు చదువుకోడానికి మంచి చోటు చూసుకొన్నావ్?" ఆమె బిందె చంకన బెట్టుకొంది.

నా చేతుల్లోనుంచి పుస్తకం క్రిందపడింది, పాకుడు రాళ్ళపై కెరటం తల బద్దలుకొట్టుకొని వెనక్కు తిరిగింది. ముందుకు వంగి పుస్తకం అందుకున్నాను. ముఖంపై చెమట తుడుస్తున్నకొద్దీ విజృంభించింది. కాళ్ళు పెద్ద పెద్ద అంగలేశాయి. వెనుకనుంచి మాటలు వినిపించాయి.

"మళ్ళీ ఎవరికొంప ముంచుదామనో ... దాని కెలానో పెండ్లయింది."

వీధి వాకిలి తెరచుకొని మా కొట్టంలోకి చేరాను. జొన్నచొప్ప ప్రక్కన మంచం వాల్చుకొని కూర్చున్నాను చాటుగా. పెద్ద శబ్దంచేస్తూ మళ్ళీ వీధి తలుపు తెరచుకొంది. బొద్దుగా ఎర్రగా ఉన్న నెలల పిల్లను ఎత్తుకొని ఒక కాలు వాకిట్లో పెట్టింది. జయ. నేను అనాలోచితంగా నిలబడ్డాను.

ఆమె ఇవతలకు దిగి రెండవ చేతితో ఒక పిల్లవాడిని దించి సూటిగా ఇంట్లోకి నడవసాగింది. పిల్లవాడు దించిన చోటునుంచి ఒక అంగుళం అటూ ఇటూ జరుగలేదు. 'సీజ్‌ఫైర్' లైను గీచుకున్నాడు, చేతిలో బొమ్మ నేలకేసి కొట్టాడు. ఏడుపు లంకించుకొన్నాడు.

జయ వెనక్కు తిరిగింది రుసరుసలాడుతూ. "అబ్బ ! పాడు పిల్లాడు...పాడుగాను.. !" అంటూ రెండు వీపుపై చరచింది. వాడు నేల మీదపడి కాళ్ళు చేతులూ విసురుకోవడం మొదలుపెట్టాడు.

ఒక్క ఊపుతో జయ జడ వెనక్కువేసుకుంది. జారిపోతున్న పిల్లను ఎత్తుకొంది.

"లే ... బిస్కట్లు పెడతా — త్వరగా లేస్తే అన్నీ నీకే — చెల్లికి లేవు."

పిల్లవాడ్ని లేవదీసి బట్టల కంటుకొన్నదుమ్ము దులిపాను. వాడు ఏడుపు మానేసి బుంగమూతి పెట్టుకొని, వాళ్ళ అమ్మ చీర చెరుగు పట్టుకొని, దూరంగా జరిగాడు.

"వెళ్ళు ... తప్పుకదూ ... మామయ్య ...బిస్కెట్లు ఇస్తారు... వెళ్ళు ... "అంటూ బిస్కత్తులపొట్లం నా చేతి కిచ్చింది.

ఆ బిస్కత్తులు నేనందుకోవడం చూసి కాంగ్రెసు టిక్కెట్టు దొరికిన ఎమ్. ఎల్. ఏ. అభ్యర్థిలా ముఖం పెట్టాడు. సందేహిస్తూ, ఎగాదిగా చూస్తూ వాళ్ళమ్మ చీరచెరుగు వదిలాడు.

"జయా. నీ కొడుకుని ఆ డాల్డా వనస్పతి ఎడ్వర్టైజ్‌మెంటుకు పంపక పొయ్యావా ?" అన్నాను.

"తిండిబోతు వెధవ ! ఎప్పుడు ఏదో ఒకటి ఉండాలి ... వాళ్ళ నాన్న చాలు" అని లోపలికి నడిచింది. నేను వాడిని తీసుకొని కొట్టంకేసి నడిచాను. జయ నన్ను మళ్ళీ పిలిచింది.

"బిస్కట్లు అన్నీ పెట్టకు - జబ్బు చేస్తుంది."

"సరే" అని తల ఊపాను.

నేను వాణ్ని ఒళ్ళో కూర్చోబెట్టుకొని ఒక బిస్కట్టు ఇచ్చాను. వాడు దాని అంతు తేలుస్తున్నాడు. మా పెయ్యిదూడ ఆ మూల నెమరు వేస్తున్నది. ఈ మూలన నేను నా పాత జీవితాన్ని నెమరు వేసికో సాగాను.

* * *

"లెక్కలు చూసి వేశావా?" మాష్టారి కోపం బెత్తంలో వణుకు తున్నది.

నిజమేనని తల ఊపాను.

"ఎవరి పుస్తకంలో—?" ముందుకు కదిలారు.

చెప్పాను.

"చెయ్యిచాచు—ఊఁ."

"ఆ చెయ్యి—"

"చెయ్యితిప్పు—ఊఁ—బండరాముడు పాడుగాను."

బెత్తం రెండు ముక్కలయింది. మాష్టారు కోపాన్ని వాయిదా వేసుకొన్నాడు. గంట కొట్టారు. అందరూ బయటికి పరుగెత్తారు—నేను చొక్కాతో కళ్ళు తుడుచుకొంటున్నాను.

"చేతులు ఎర్రగా కందిపొయ్యాయి చూడు. చూసివేశానని ఎందుకు చెప్పావ్ ?" .... జయ నా అరచేతులపై చల్లగా గాలి ఊదింది.

ఆ రోజునుండి జయ నాకు పంతులమ్మ. నాకు లెక్కలు నేర్పించింది తను, నాచేత ఇంగ్లీషు 'రెసిటేషన్' అప్పచెప్పించుకొంది. బడికి ఎగగొట్టి ఈతకు వెళ్ళినప్పుడు నా పుస్తకాలు జాగ్రత్తగా తీసుకువచ్చేది.

*          *          *

కిటికీ చెంతగా పెద్ద కలకలం వినిపించింది, ఇంట్లోనుంచి.

"జయా, నీ కూతురటే ! - ఎంతబాగుందే ! ... ఈ గౌను నైలానుదా ? ... ఎక్కడ కొన్నారు?" మూడు నాల్గు గొంతులు జయను పల్కరిస్తున్నాయి ఆశ్చర్యంగా ...

"ఎవరు ? జయమ్మా ?" మా నాయనమ్మ కంఠం వణకుతున్నది,

"ఎప్పుడొచ్చావే తల్లీ ? ... అసలు నీవు ఈ ఇంటి కోడలివి కావల్సిందే !.. అఁ, ఏమిటో మన పిచ్చిగానీ ... మన మనుకున్నట్లు జరిగితే ఆ పైవా డెందుకు ? భాస్కరాన్ని పలకరించావా అమ్మా ? ఏం మారిపోయ్యావే ! వాడికింకా పెళ్ళికాలేదు. నీకప్పుడే ఇద్దరు పిల్లలు."

మా నాయనమ్మ మాటలు వినిపించకుండా పోయ్యాయి. కోలాహలం దూరంగా పోయింది ... మళ్ళీ నా కళ్ళముందు ఆ రోజులు కనిపించాయి.

*          *          *

ఒక రోజు జయ నాతో చెప్పింది "నేను ఇదివరకులా ఇళ్ళవెంట తిరగకూడదు... నీతో కూడా మాట్లాడకూడదు"– అని.

అప్పటినుంచి హోం వర్కు నాకు నేనే చేసుకొన్నాను. రెసిటేషన్ పద్యాలు నాకు నేనే కళ్ళు గట్టిగా మూసుకుని అప్పచెప్పుకున్నాను. పగలంతా కష్టపడి కట్టెలుకొట్టిన వానికి సాయంత్రానికి రెండున్నరకన్న ఎక్కువ దొరకనట్లు నాకు మాస్టారు ముప్పయి ఐదు మార్కులకన్నా ఎక్కువ ఇచ్చేవారు కాదు. కానీ, లెక్కల పేపర్లోమాత్రం పూర్తిగా దగా పడిపోయాను. ఒకే సంఖ్యలానున్న మార్కులపై ఎర్రసున్న చుట్టి నాపై విసిరారు మాస్టారు. జయ ఒక కంటితో ఆ సున్నను పరికించింది.

జయను పిలిచాడు మాస్టారు "మగ పిల్లాడివయి పుట్టాల్సింది ..., ఇంజనీయరువై పొయ్యేదానవు సిగ్గు లేదురా మీకు ?" ఆ చివరి మాట నాకేసిచూసే అన్నాడు.

సాయంత్రం మా ఇంటికి వచ్చింది తను. నేను చాప వేసుకొని లెక్కలు చేసుకొంటున్నాను. నాకు దూరంగా కూర్చొని లెక్కలు చెప్ప సాగింది. నేను తనను పరీక్షగా చూశాను. యవ్వనం తెచ్చిపెట్టిన కొత్త అందాలు ఆమెలో నిండుకొన్నాయి. సిగ్గుపడడం, దూరంగా కూర్చో వడం, ఓరగంటితో విషయాన్ని తెలుసుకోవడం, ఇవన్నీ తను క్రొత్తగా నేర్చుకొంటున్నది.

"వింటున్నావా ? ... ఎటు చూస్తున్నావ్ ?" కనురెప్పలు పైకెత్తి నాకేసి కోపంగా చూసింది. జయ కళ్ళు మెరుస్తున్నాయి. నిశ్చలంగా నిల బడలేకపోతున్నాయి. నాకేసి చూడలేక కళ్ళు దించేసుకొంది. నాకేసిచూడ కుండా గంటసేపు లెక్కలు చెప్పింది.

"చీకటి పడుతోంది ... నేవెళ్తా. పిన్నీ నే వెళ్తున్నా" అంటూ లేచి నిలబడింది.

"వెళ్తున్నావా తల్లీ . ఈ మొక్కజొన్నకంకులు, బంతిపూలు ఇంటికి తీసికెళ్ళమ్మా. సాక్షాత్తు చదువుల తల్లివే..." మా నాయనమ్మ చావిట్లోనుంచి పిలిచింది.

"అలా బెల్లం కొట్టిన రాయిలా కూర్చొకపోతే, దాన్ని ఇంటి దాకా దిగబెట్టిరారా ? అది నీకోసం అంతదూరంనుంచి వస్తే బాగా చీకటి పడిపోయిందే !" ... మా నాయనమ్మ నన్ను చాపమీదనుంచి లేపింది.

"నే వెళ్తాలే రాకు" సన్నగా అంది జయ.

"ఎందుకని ?"

"ఎందుకేమిటి ? వద్దంటే ... వినిపించుకోవేం ?" ఓరచూపు చూస్తూ కాలి బొటనవ్రేలితో అర్ధవృత్తాన్ని గీస్తూ చెప్పింది.

"రేపటినుంచి నీవు మా ఇంటికి వచ్చి లెక్కలు చెప్పించుకోవాలి. నేను మగపిల్లవాడ్ని కాను. ఇష్టంవచ్చినట్టు తిరగటానికి." జయ చకచక వెళ్ళిపోయింది.

ఆ సంవత్సరం జయతోపాటు నేనూ ఎస్. ఎస్, ఎల్. సి. పాసయ్యాను. జయ ఫలితాలు పడిన పేపరుతో మాయింటికి వచ్చింది.

"మా నాన్న నన్ను కాలేజీలో చేర్పించనన్నారు." జాలిగా చెప్పింది జయ. కొత్త చీరెకు కుచ్చెళ్ళు సర్దుకొంటూ.

నాకు పెద్ద చదువు చెప్పించాలన్న మా నాయనమ్మ ప్రతిపాదన తీర్మానంగా నెగ్గింది: నాకు ముచ్చెమటలు పోశాయి.

"పాడు పరీక్ష - పాసవడం, నా ప్రాణంమీదకి వచ్చింది...తప్పి నట్లయితే ఎంచక్కా ఇంటిపద్ద ఉండిపోవచ్చు. కాకపోతే రెండురోజులు కేకలేస్తారు" అనిపించింది.

* * *

మళ్ళీ కిటికీ వద్ద కోలాహలం వినిపించింది.

"అయితే నీ కొడుకుని వాళ్ళ నాన్న దగ్గర విడిచొచ్చావా?" ఓ పేరంటాలు ప్రశ్నిస్తున్నది.

"లేదండీ - బయట భాస్కరంవద్ద ఉన్నాడు." వినయంగా చెబు తున్నది జయ కంఠం.

కిచకిచమని నవ్వారు ఎవరో. నేను వాడికేసి చూశాను. సగం పొట్లం ఖాళీ చేశాడు. చొక్కానిండా చొల్లు కార్చుకొన్నాడు. కొద్దిగా నాకూ ఆ గంధం పూశాడు. నేను చేతిగుడ్డతో తుడుచుకొని వాడి మూతి తుడుస్తు న్నాను.

రెపరెప ఒక సిల్కుచీరె ఇంద్రధనుస్సులా మెరసి మాయమైంది. గోడకు ఆవల ప్రక్క నిలబడింది ఆ విగ్రహం. ముఖం సరిగా కనబడడం

లేదు. గాజుల శబ్దం. పోల్చుకోలేని ఆకారం. ఇవతలకు వచ్చి నాచూపులో నిలబడాలని కోరిక ఆ బొమ్మకు. కానీ సౌకుమార్యమున్న స్త్రీగా నిరూపించుకోడానికై కొద్దిగా గోడచాటుచేసుకొంది.

"ఎవరూ ?" పిలిచాను.

"నేను." ప్రత్యక్షమైంది జడ ఊపుకొంటూ. ముఖంనిండా పౌడరు మెత్తుకొంది. "జయ కొడుకుని చూద్దామని" అంటూ వాడ్ని ఎత్తుకొని నఖశిఖ పర్యంతం పరిశీలించింది ఆ అమ్మాయి.

"బిస్కట్లు తెప్పించావా ?" నవ్వింది.

"అవన్నే తెప్పించకుండా ఎలా ఉంటావ్ ? అచ్చం నీలాగే ఉన్నాడు. ఆ నవ్వు చూడు, నీ నవ్వే ... నీ ఈడొచ్చేసరికి."

సున్నం పెళ్ళ విరిగి నామీద పడింది. పైకి చూశాను. పిచ్చుక జంట గూడు కట్టుకొంటున్నాయి, గోడలో చితుకులు ఏరి కూర్చుకొంటున్నాయి వాటి సంతానంకోసం, వాటి గూటి క్రింద నేను కూర్చున్నాను. సున్నం రాలింది.

ఆ మాటలన్న స్త్రీమూర్తికేసి చూశాను. నన్ను చూసి నవ్వుతూ సమాధానం చెప్పాలనుకొన్నాను, కంఠం పెగల్చుకొన్నాను. కానీ గొంతులోనే ఉండిపొయ్యాయి మాటలు,

ఆమె వెళ్ళిపోయింది. నేను పిల్లవాడికేసి చూశాను, ఉంగరాలు ఉంగరాలుగా ఉన్న తల, నల్లటి కళ్ళు, ఎర్రగా బొద్దుగా ఉన్నాడు. వాడి దొడ్డికాళ్ళకు ఎర్రబూట్లు కట్టుకొన్నాడు:

పేరంటం ముగిసినట్లు సందడి. అందరూ బిలబిలమంటూ బయటకు నడిచారు. జయ కంఠానికి గంధం పూసుకొని వచ్చింది. కూతురు అరటిపండు పట్టుకుంది, జయతో అమ్మా, నాయనమ్మా యిద్దరూ కొట్టంలోకి వచ్చారు.

"నీ పెళ్ళయ్యాక భాస్కరాన్ని చూడడం ఇదే కదమ్మా... వాడటు కాలేజీకి పోయాడు, నీ పెళ్ళయింది. ఆ...మీ ఆయన కెక్కడుద్యోగం? ... నా మతిమరుపుమండా అది ఏదేశం ?" నాయనమ్మ అడిగింది.

"భిలాయ్," జయ సమాధానం.

"మామయ్యకు నమస్తే చెప్పు - వెళ్దాం."

వాడు రెండుచేతులూ జతచేర్చాడు.

"ఎఱ్ఱ తేలల్లే నీ కొడుకు ఎంత ముచ్చటగున్నాడే" - మానాయనమ్మ వాడి బుగ్గలు నిమిరి తల్లో మెటికలు విరుచుకొంది.

అంతలోనే మా అమ్మ పెద్దగా అరచింది, "ఇదేమిట్రా మరకలు ... అయ్యోయ్యో పువ్వులాంటి లాగు పాడుచేసుకొన్నావ్."

"బాటలో నడిచేటప్పుడు జాగ్రత్తగా చూసి నడవాల్రా ...ఆ... ఇవి పిచ్చికూసంపాలో! జిల్లేడుపాలో ...ఎట్లా బతుకుతావోరా"- మా నాయనమ్మ సానుభూతి.

అవును. చూసి నడవాలి. జిల్లేళ్ళమధ్య, జిల్లేళ్ళు! బొమ్మజెముడు పొదలు. పిచ్చికూసం చెట్లు. పనికిమాలినచెట్లు వికృతంగా వ్యాపించిన వాటి వెనుక విషనాగులు బుసలు కొడుతాయి. వాటిని గులాబీల్లా పొదలు చేసి. నీరుపోసి పెంచవలసిన అవసరం లేదు. పడి మొలుస్తాయి. కొట్టి పారేసినా మళ్ళీ పెరుగుతాయి - జిల్లేళ్ళు.

"వాడిని ఇంటిదాకా దిగవిడిచిరా! దాన్ని ఎత్తుకోమని కొండాటకం ఆడుతున్నాడు - పాపం!" 'అల్టిమేటమ్' జారీ చేసింది, మా నాయనమ్మ.